డ్యూటీ ఈజ్ ఫస్ట్

ఉప్పులూరి సత్యనారాయణ

"మదర్ సీరియస్. స్టార్ట్ ఇమిడియట్లీ" టెలిగ్రాం అందుకుని వణుకుతున్న గొంతుతో చదివాడు రవికృష్ణ. అతనికి క్షణకాలం పాటు షాక్ తిన్న వాడిలా కుర్చీలో కూలబడి పోయాడు. కళ్ళల్లో నీరు నిలిచింది అప్రయత్నంగా.

రవికి టెలిగ్రాం రావటం, అతను కుర్చీలో కళ్ళనీళ్ళు పెట్టుకుని కూలబడి పోవటం గమనించిన అతని కొలీగ్సు అంతా అతని టేబుల్ చుట్టూ చేరి "మిస్టర్ రవీ ఏమైంది" అని అడిగారు ఆత్రంగా. అతను అందుకు సమాధానంగా టెలిగ్రాం తీసి వారికి చూపించాడు.

"రవీ వారం రోజులు శలవు పడేసి వెంటనే బయలుదేరు. మెయిల్‌కూడా వచ్చే వేళయింది. సాయంత్రానికల్లా మీ ఊరు చేరగలవ్. ధైర్యంగా వుండు మీ అమ్మగారు నువ్వు వెళ్ళే సరికి క్షేమంగానే వుంటారు" అందరికంటే సీనియర్, వయసులో పెద్దవాడు, హెడ్ గుమస్తాగా పని చేస్తున్న సుబ్బారావు రవికృష్ణకు ధైర్యం చెప్పాడు.

"ఆఫీసువర్కు బోలెడు పెండింగ్‌లో వుంది. రేపు ఉదయానికల్లా పూర్తి చేసి, సీటు అప్ టు డేట్ చేసి చూపించ మన్నాడు మన ఆఫీసరు. రేపు జనరల్ మేనేజర్ ఇనస్పెక్షన్ కూడా వుందటకదా. శలవు అడిగితే ఇస్తాడో ఇవ్వడో, అసలే చండశాసనుడు". రవికృష్ణ సందేహం వ్యక్తం చేసాడు.

"టెలిగ్రాం చూపించు. ఎంత కర్కోటకుడైనా కన్నతల్లి చావు బ్రతుకుల్లో వుందంటే కరిగి పోకతప్పదు. లీవ్ లెటర్ వ్రాసి ధైర్యంగా వెళ్ళి అడుగు" ప్రోత్సహించారు కొలీగ్సు.

రవికృష్ణ లీవ్ లెటర్ వ్రాసి దానికి టెలిగ్రాం జత చేసి ఆఫీసర్ ఛాంబర్ వైపు బయలు దేరాడు. రవికృష్ణ ఆ ఆఫీసులో జూనియర్ అసిస్టెంటుగా ఉద్యోగంలో చేరి ఇంకా ఏడాది పూర్తి కాలేదు. ఎం. ఎ. పూర్తి చేసిన తరువాత అయిదు సంవత్సరాలు నిరుద్యోగంతో పోరాటం జరిపి చివరికి అతికష్టం మీద ఈ చిరు ఉద్యోగం సంపాదించుకున్నాడు. అతని తండ్రి చిన్నప్పుడే కాలం చేస్తే వున్న కొద్ది పాటి ఆస్తిని కరిగించి కొడుకును పోస్టు గ్రాడ్యుఏట్‌ను చేసింది అతని తల్లి సీతమ్మ. రవికృష్ణ తరువాత ఇద్దరు పెళ్ళి కావలసిన చెల్లెళ్ళు అతని మీద ఆధారపడి వున్నారు. పట్నంలో ఇంటి అద్దెలు ఖర్చులు భరించ లేక తల్లిని చెల్లెళ్ళను పల్లె టూరులో వున్న సొంత ఇంట్లోనే వుంచి తను క్లుప్తంగా ఖర్చు పెట్టుకుని జీతంలో మిగిలిన సొమ్మును నెల నెలా తల్లి పేర మని ఆర్డరు చేస్తూ వుంటాడు. అతను నెల రోజుల క్రిందటే అతికష్టం మీద రెండు రోజులు శలవు శాంక్షన్ చేయించుకుని తల్లిని చెల్లెళ్ళను చూసి వచ్చాడు. అప్పటికి అతని తల్లి ఆరోగ్యంగానే వున్నది. ఇంతలోనే ఇంత ప్రమాదం వచ్చి పడుతుందని కలలో కూడ ఊహించుకోలేదు.

ఆఫీసర్ దయానందరావు ఆ ఆఫీసుకు కొత్తగా వచ్చాడు. అతను అంతకు ముందు మిలట్రీలో పని చేసి, తరువాత గ్రూప్ -వన్ సర్వీసు కమిషన్‌లో సెలక్టయి డైరక్టు ఆఫీసరుగా వచ్చాడు. అతను రాక ముందు ఆ ఆఫీసు గురించి చాల బాడ్ రిపోర్టు వెళ్ళింది. స్టాఫ్ అంతా అవినీతి పరులనీ, ఎవరు ఎప్పుడూ సీట్లో కూర్చోరని, ఒక్కరు చేయవలసిన పని నలుగురు చేస్తున్నా వర్కు అంతా పెండింగ్‌లో వుందని హెడ్ ఆఫీసుకు ఇరవై పేజీల రిపోర్టు వ్రాసి పంపారు ఇన్విస్టిగేషన్‌కు వచ్చిన ఆఫీసర్లు. దయానందరావు అప్పటికే చాల ప్రిన్సిపల్‌డ్ మాన్ అనీ, స్ట్రిక్టు ఆఫీసరని డిపార్టు మెంటులో మంచి పేరు తెచ్చు కున్నాడు. ఆ ఆఫీసు రిపోర్టు చూడగానే దయానందరావుని ఆ ఆఫీసుకి ఇన్‌ఛార్జిగా పోస్టు చేసారు.

దయానందరావు వచ్చిన నెల రోజుల్లోనే, ఆఫీసు పరిస్థితులన్నీ చక్క దిద్దాడు. అతను వచ్చిన తరువాత స్టాఫ్ అంతా సీట్ల నుంచి కదలకుండా, వంచిన తల ఎత్తకుండా పని చేయటం ప్రారంభించారు. అతనికి ఎదురు తిరిగిన ఇద్దరు ముగ్గుర్ని దూర ప్రాంతాలకు బదిలీ చేయించటమూ, సస్పెండ్ చేయటమూ కూడ జరిగింది. దాంతో మిగిలిన స్టాఫ్ కూడ తమ ప్రవర్తనను చక్క దిద్దుకున్నారు.

గుండె దడ దడలాడుతూ వుండగా రవికృష్ణ శలవు అప్లికేషన్ పట్టుకుని ఆఫీసరు గదిలోకి అడుగు పెట్టాడు. దయానందరావు చప్పుడు చేయకుండా వచ్చి మౌనంగా నిలబడిపోయిన రవికృష్ణను గమనించలేదు. అతను ఏదో ఫైలు స్టడీ చేస్తూ పనిలో నిమగ్నమై వున్నాడు.

అయిదు నిమిషాలు తరువాత తల ఎత్తి ఎదురుగా నిలబడివున్న రవికృష్ణను చూసి, "ఎస్! వాడ్యూ యూవాంట్" అన్నాడు

రవికృష్ణ గొంతులో తడి ఆరిపోయింది. నెమ్మదిగా ధైర్యం తెచ్చుకుని, "సార్, మా మదర్‌కు సీరియస్‌గా వున్నట్లు టెలిగ్రాం వచ్చింది. నాకు రెండు రోజులు శలవు కావాలి" అంటూ టెలిగ్రాం జతపరచిన లీవ్ లెటర్ అందించాడు.

దయానందరావు టెలిగ్రాంను, లీవ్ లెటర్‌ను పరిశీలనగా చూసి, "ఐ యామ్ సారీ మిస్టర్ రవికృష్ణా! రేపు జనరల్ మేనేజర్ మన ఆఫీసు ఇనస్పెక్షన్‌కు వస్తున్నట్టు నీకు తెలుసు కదా! అసలే నీ వర్కు కూడ పెండింగ్‌లో వుంది. ఈ పరిస్థితుల్లో నీకు శలవు ఎలా గ్రాంట్ చేయగలను" చాల శాంతంగా సున్నితంగా చెప్పాడు దయానందరావు.

రవికి ఆఫీసర్ సమాధానం విని ఒక్క క్షణం నోట నుంచి మాట పెగల్లేదు. మౌనంగా నిలుచుండి పోయాడు. అతనికి కళ్ళ నీళ్ళు తిరిగాయి.

"చెప్పవలసిందింకేమైనా వుందా?"

"మా అమ్మ కేదైనా జరగకూడనిదే జరిగితే, మా చెల్లెళ్ళు దిక్కులేని వాళ్ళయి పోతారు. దయచేసి నన్ను ఈ ఒక్కసారికి వదిలి పెట్టండి సార్." అన్నాడు రవికృష్ణ.

"మిస్టర్ రవికృష్ణా నీ పరిస్థితి నాకు అర్థమైంది. బట్ ఐ యామ్ హెల్ప్‌లెస్. నా స్థానంలో నువ్వు కూర్చున్నా ఇలాగే సమాధానం చెప్పి వుండేవాడివి. ట్రైటు అండర్‌స్టాండ్ మీ. డ్యూటీ ఈజ్ ఫస్ట్. ఆ తరువాతే అన్నీ. ఈ ఆఫీసులో శలవు కావలసి వచ్చినప్పుడల్లా దొంగ టెలిగ్రామ్స్ ఇప్పించుకోవటం మొదట నుంచి అలవాటే. నువ్వు అలా చేయవని నాకు తెలుసు. ఐ నో. యువర్ సిన్సియారిటీ.... ఇనస్పెక్షన్ పూర్తి కాగానే పది రోజులు శలవు ఇస్తాను... సరేనా...."

దయానందరావు మాటలకు రవికృష్ణకు నరనరాలు కోపంతో రగిలి పోయాయి. కానీ తను అసహాయుడు. ఎన్నో ఏళ్ళ నిరీక్షణ తరువాత అతి కష్టం మీద ఈ ఉద్యోగాన్ని సంపాదించుకో గలిగాడు. క్షణికమైన ఉద్రేకంతో, పట్టుదలతో నోరు జారి ఈ ఉద్యోగాన్ని కూడా పోగొట్టుకుంటే, తనకు నిలవ నీడ కూడ వుండదు. తన ఆవేశాన్ని పళ్ళ బిగువున అణుచుకుని తలవంచుకుని బయటకు వచ్చాడు.

అతను బయటకు రాగానే కొలీగ్సు అంతా చుట్టు ముట్టి "ఏం జరిగింది. శలవు గ్రాంట్ చేసాడా?" అని అడిగారు. రవికృష్ణ జరిగిందంతా చెప్పాడు.

"వీడంత దుర్మార్గుడు ప్రపంచంలో ఎక్కడా వుండడు. తల్లి చావు బ్రతుకుల్లో వున్నదన్నా శలవు ఇవ్వని కర్కోటకుడు. సమయం వచ్చినప్పుడు అంతా కలిసి వీడికి సరియైన గుణపాఠం నేర్పాలి."

స్టాఫ్ అంతా ఎవరి చిత్తం వచ్చినట్లు వారు దయానందరావును నిందించారు.

★ ★ ★ ★

ఇంత హడావిడి జరిగినా, చివరికి జనరల్ మానేజర్ ఇనస్పెక్షన్ జరగ లేదు. నెల రోజుల తరువాత వరకు పోస్టుపోన్ అయినట్లు టెలెక్సు

మెసేజ్ మరుసటి రోజు సాయంత్రానికి చేరింది

మూడవ రోజు ఉదయమే ఆఫీసుకు వచ్చి అటెండెన్సు రిజిస్టర్‌లో సంతకం పెడుతున్న రవికృష్ణను పిలిచి,

'మిస్టర్ రవికృష్ణా, నీకు పది రోజుల లీవ్ గ్రాంట్ చేస్తున్నాను. వెళ్ళి మీ అమ్మగారి ఆరోగ్య పరిస్థితి ఎలాగుందో నాకు పెర్సనల్‌గా ఉత్తరం వ్రాయి." అని చెప్పాడు.

రవికృష్ణ వెంటనే బయలు దేరాడు. ఈ మూడు రోజుల నుంచి డ్యూటీకి వస్తున్నా, అతని మనసంతా తల్లి మీదే వుంది. ప్రతీక్షణం అతనికి తల్లి కంటి ముందు కదులుతోంది.

అతను వెళ్ళేసరికి ఇల్లంతా నిశ్శబ్దంగా వుంది. ఇంటి నిండా మాత్రం మనుషు లున్నారు. అప్పుడే ఎవరో సంధ్య దీపం వెలిగిస్తున్నారు.

గుమ్మంలోకి అడుగు పెడుతూనే, "అమ్మా!" అని పిలిచాడు. కానీ అతని పిలుపుకు సమాధానం రాలేదు. గుమ్మంలో నిలుచున్న బంధువులు మాటలు రాని రాతి బొమ్మల వలే నిశ్శబ్దంగా వుండి పోయారు. ఆ ఇంటి వాతావరణం అతనికి ఏదో భయంకరమైన అనుమానం కలిగించింది. అతని గుండెల్ని పిండి, దుఃఖం బయటకురికింది.

మరోసారి "అమ్మా!" అని పిలిచాడు. ఆ పిలుపులో ఆశ నిరాశ, దుఃఖం భయం సమ్మిళతమై వున్నాయి. ఆ పిలుపుకు ప్రతి స్పందనగా లోపలి గదిలోంచి అతని చెల్లెళ్ళ శోకం వినిపించింది. "ఇంకెక్కడి అమ్మరా అన్నయ్యా!" అని, అతని చేతిలో బ్యాగ్ జారిపోయింది. దుఃఖాతిశయంతో మతిభ్రమించిన వాడివలే తల గోడకు గుద్దుకో సాగాడు.

అతని మేనమామ వచ్చి అతన్ని పట్టుకుని దూరంగా తీసు కెళ్ళాడు.

ఎంత ఉద్యోగం చేస్తుంటే మాత్రం కన్న తల్లి చావు బ్రతుకుల్లో వుందని టెలిగ్రాం ఇచ్చినా రాకపోవట మేమిటి? ముసలి తల్లి ప్రాణం వుంటేనేమిటి పోతే నేమిటి అనుకున్నాడు కాబోలు. బిడ్డల మీద తల్లికి మమకారం వుంటుంది గాని తల్లి మీద మమకారం బిడ్డల కెందుకుంటుంది. ఒక్కగా నొక్క కొడుకుని ఆఖరి చూపులు చసుకుందామని ఎంతో ఆశపడింది....."

కఠినమైన నిష్ఠూరోక్తులకు అతని గుండె బ్రద్దలై పోతోంది. తన ఆవేదనను బాధను ఎవరితో చెప్పుకుంటాడు. ఇదివరకైతే తన సమస్యల్ని బాధల్ని కష్టాన్ని సుఖాన్ని తల్లితో చెప్పుకుని వోదార్పు పొందేవాడు. కానీ ఇప్పుడు ఎవరితో చెప్పుకుంటాడు? ఆ తల్లి ఇక తనకు శాశ్వతంగా లేదు.

★ ★ ★ ★

కర్మ కాండలన్నీ పూర్తయిన తరువాత చెల్లెళ్ళను వెంట తీసుకుని వచ్చాడు రవికృష్ణ. ఆ మరునాడే డ్యూటీలో జాయినయ్యాడు.

మీ మదర్‌కు ఎలాగుంది?"

దానికి సమాధానంగా రవికృష్ణ రెండు కన్నీటి చుక్కలు రాల్చాడు అతని కన్నీరు అప్పటికే ఇంకి పోయింది

మన ఆపీసర్ మూలంగానే ఇంత జరిగింది జరిగిన దానికి మన ఆపీసరే బాధ్యత వహించాలి మనం విషయ మంతా జాయింట్‌గా సంతకాలు పెట్టి హెడ్ ఆఫీసుకు రిపోర్టు చెద్దాం అన్నారు

దీని గురించి మీరేమి గొడవ చెయ్యొద్దు అంతా నా దురదృష్టం అనుకుంటాను!" అన్నాడు ఆ మాట వినగానే అంతా ఎవరి సీట్లలో వాళ్ళు వెళ్ళి కూర్చుండి పోయారు

మద్యాహ్న లంచ్ అవర్‌లో వంటరిగా కూర్చున్న రవికృష్ణ సీటు దగ్గరకు వచ్చాడు దయానందరావు. "జరిగిందంతా విన్నాను. ఐ యామ్ వెరీ సారీ" అని తన సానుభూతిని తెలియజేసి వెళ్ళి పోయాడు. రవికృష్ణ అతని సానుభూతి వచనాలకు బదు లివ్వలేదు. మౌనంగా వుండి పోయాడు.

★ ★ ★ ★

నెల రోజుల తరువాత అనుకున్న జనరల్ మానేజర్ ఇనస్పెక్షన్ ప్రోగ్రాం రానే వచ్చింది. తెల్లవారితే ఇనస్పెక్షన్ అనగా ఆ సాయంత్రం ఆఫీసవర్సు తరువాత స్టాప్ అంతా సమావేశ మయ్యారు.

"మన ఆఫీసర్‌కు బుద్ధి చెప్పటానికి తగిన సమయం ఇదే. రేపు ఉదయం జనరల్ మేనేజర్ ఆఫీసులో అడుగు పెట్టేసమయానికి "మదర్

ఎక్స్‌పైర్‌డ్" అని దయానందరావుకు అందేలా టెలిగ్రాం ఇద్దాం. "డ్యూటీ ఈజ్ ఫస్ట్" అని ఎదుట వాళ్ళకు నీతులు చెప్పే ఈ పెద్ద మనిషి అప్పుడు ఎలా బిహేవ్ చేస్తాడో చూద్దాం. అప్పుడుగాని ఎదుట వాళ్ళ కష్ట సుఖాలు అర్థం కావు. టిట్ ఫర్ టాట్" హెడ్ క్లర్కు సుబ్బారావు సూచించాడు. మిగిలిన అందరూ ఈ పథకానికి అంగీకరించారు.

మరునాడు ఉదయం పది గంటలకు జనరల్ మేనేజర్‌తోను, అతనితో వచ్చిన ఇతర అధికారులతోను మీటింగ్ హాల్లో కాన్ఫరెన్సు ప్రారంభమైంది. ముఖ్యమైన విషయాలను ఫైల్సు తీసి చూపిస్తూ ప్రసంగిస్తున్నాడు దయానందరావు. సరిగ్గా అదే సమయంలో అతనికి టెలిగ్రాం అందింది. స్టాఫ్ అంతా అతను ఆ టెలిగ్రామ్‌కు అతను ఎలా రియాక్టవుతాడోనని ఆత్రంగా ఎదురు చూడసాగారు. కాని దయానందరావు ఎవరూ ఊహించని విధంగా ఆ

గురుతిరస్కృతి

ధర్మపథం



గురువు శిష్యులందరికీ విద్యను సమానంగానే బోధిస్తాడు చురుకైన బుద్ధి గలవారు గురువు చెప్పిన దానిని బాగా గ్రహించ గలరు. మందబుద్ధులు గ్రహించలేరు. గ్రహించే వారి పయి అభిమానం గురువునకు ఉండడం సహజం. ఆ అభిమానాన్ని ప్రశంసగా ఊహించి కొందరు శిష్యులు గర్వించడం కూడా కాన వస్తున్నది. గర్వం చాలా చెడ్డది. అది కలిగిందంటే క్రమంగా వృద్ధి పొందుతుందే! కాని తగ్గదు. ఆ విద్యాగర్వం, శిష్యులందరిలోనూ తానే అధికుడననే అభిప్రాయాన్ని కలిగిస్తుంది. ఒకప్పుడది, గురువు కంటే కూడా తానే విద్యాధికుడననే అభిప్రాయాన్ని కలిగిస్తుంది. విద్యా గర్వం చాలా చెడ్డది. విద్య వల్ల వినయం ఏర్పడవలెనే కాని గర్వంగాని, అవిధేయత గాని కలగకూడదు. విద్య నేర్చుకునే వారు దీనిని గ్రహించాలి.

ఒకడు మల్ల విద్య నేర్చు కొనుటకు సమర్థుడైన ఒక గురువు నాశ్రయించాడు పెక్కు మల్ల విద్యా రహస్యాలను ఆ గురువు వద్ద నేర్చుకొని అందులో మిక్కిలి నైపుణ్యం సంపాదించి చాలా ప్రదర్శనాలలో ప్రజల మెప్పును గడించాడు. కొందరు అతణ్ణి గురువును మించిన వారని అన్నారు: గురువుకూ, ఇతనికీ పోటీ పెడితే ఇతడే తప్పక గురువును ఓడించగలడని వారు అనుట వల్ల ఆ శిష్యుడికి అహంకారం అధిక మయింది. కొందరి ప్రోత్సాహంతో అతడు తన గురువుతోనే మల్లయుద్ధం చెయ్యడానికి సంకల్పించి, పోటీకి ఆయనను ఆహ్వానించాడు. గురువుకు ఆశ్చర్యం కలిగింది. తనకంటె అధికుడననే గర్వంతో శిష్యుడు పోటీకి పిలుస్తాడని ఆయన అనుకో లేదు. అయినా, వెనుక తీయకుండా పోటీకి సిద్ధపడ్డాడు.

కొంతసేపు గురుశిష్యు లిద్దరూ సరిసమానంగానే యుద్ధం చేశారు. ఆ తర్వాత గురువు, తన శిష్యునికి తెలియని బంధవిశేషాన్ని ప్రయోగించి అతడిని చిత్తు చేశాడు, శిష్యుడి గర్వం అణిగింది. ఓడిపోయిన శిష్యుడు "నాకు మీరు ఈకిటుకు చెప్పలేదేమి? దీన్ని చెప్ప కుండా నన్ను మోసం చేశారు "అని అన్నాడు. గురువు "నాయనా! నీ వంటి అహంకారం గల శిష్యుల వల్ల ఎప్పుడయినా అపాయం కలగవచ్చు అనే ఆలోచన నాకు ఉండబట్టే, దీనిని మాత్రం నీకు చెప్పలేదు. దీన్ని కూడా చెప్పి వేస్తే నాకు ఓటమి తప్పేది కాదు. ఆత్మరక్షణ అందరికీ ముఖ్యమయినదే! నిన్ను మోసగించే నని అనుకోవడం నీ అహంకారానికీ, అవివేకానికీ గుర్తు" అని అన్నాడు. శిష్యుడు తల వంచుకున్నాడు. గురువును ధిక్కరించిన శిష్యుడికి తగిన శాస్తి అయిందని ప్రేక్షకులు సంతోషించారు. శిష్యుణ్ణి ప్రోత్సహించిన వారు మొగాలు ముడుచుకున్నారు. గురు తిరస్కృతి అనర్థానికి మూలం కాక తప్పదు.

—బులుసు వేంకట రమణయ్య

డ్యూటీ ఈజ్ ఫస్ట్

టెలిగ్రామ్‌ను విప్పి చదువుకుని, ఏమాత్రం చలించకుండా మడిచి కోటు జేబులో వేసుకుని తన పనిని తాను చేసుకు పోసాగాడు అతని ప్రవర్తన ఎవరు ఊహించని విధంగా ఆశ్చర్యంలో ముంచెత్తింది

ఆ సాయంత్రం జనరల్ మానేజర్ ఇనస్పెక్షన్ పూర్తి కాగానే అందరికీ వీడ్కోలు చెప్పిన తరువాత టెలిగ్రాం చదువుకుని కళ్ళ నీళ్ళు జేబు రుమాలతో తుడుచుకుంటూ వుండి పోయాడు

ఆ క్షణంలో సుబ్బారావు లోనికి వెళ్ళాడు అతనిని అనుసరించారు మిగిలిన వాళ్ళు దయానందరావు అంతా ఒకేసారి రావటం చూసి కళ్ళ నీళ్ళు తుడుచుకుని, 'మీ అందరి సహకారం వల్ల ఇనస్పెక్షన్ విజయవంతంగా ముగిసింది మీ అందరిని పేరు పేరున అభినందిస్తున్నాను' అన్నాడు

"మేము వచ్చింది అందుకు కాదుసార్?'

'మరి ఎందుకు?'

మీరు క్షమిస్తానంటే నిజం చెపుతాం!

చెప్పండి!

"మీ అమ్మగారు నిజంగా చనిపోలేదుసార్!

ఆ మాటలు విని దయానందరావు మాట్లాడలేదు చిన్న నవ్వు నవ్వాడు ఆ నవ్వు పేలవంగా వుంది తిరిగి సుబ్బారావు చెప్పాడు

రవికృష్ణ తల్లి చనిపోయినప్పుడు, టెలిగ్రాం వచ్చినా శలవు ఇవ్వలేదు 'డ్యూటీ ఈజ్ ఫస్ట్' అని నీతులు చెప్పారు అదే మీ విషయంలో జరిగితే మీరు ఎలా ప్రవర్తిస్తారో ప్రత్యక్షంగా చూడాలని, మా కష్ట సుఖాలు మీరు అర్థం చేసుకోవాలనీ మేమే ఆ టెలిగ్రాం ఇచ్చాం కానీ మేమే ఓడి పోయాం ఈ పరీక్షలో మీరే గెలిచారు మిమ్మల్ని అనవసరంగా దుఃఖ పెట్టినందుకు క్షమించమని కోరుతున్నాం

"నేను ఎదుట వాళ్ళకు చెప్పిన నీతులు నేనూ ఆచరిస్తాను అలా ఆచరణ యోగ్యం కాని నీతులు నేను ఎదుటవాళ్ళకు ప్రభోదించను కానీ మీరు ఇంకా తెలుసుకోవలసిన నిజం ఒకటుంది అన్నాడు

ఏమిటి సార్ అది అన్నారు అంతా.

"మా అమ్మ నిజంగానే ఈ వేళ ఉదయం ఎనిమిది గంటలకు చనిపోయింది ఆమె శవం ఇంటి దగ్గర ఒంటరిగా వదిలి వచ్చాను ఇప్పటికి ఆ శవం నా కోసం ఎదురు చూస్తూనే వుంది ఈ ప్రపంచంలో నాకు నా తల్లి, నా తల్లికి నేను తప్ప మాకెవరూ తోడు లేరు ఇక నుంచి నాకు ఆ తోడు కూడా లేదు. ఇప్పుడు నేను ఇంటికి వెళ్ళి నాకోసం ఎదురు చూసే నా తల్లి శవానికి అంతిమ సంస్కారానికి ఏర్పాట్లు చేసుకోవాలి'

దయానందరావు మాటలు విని అంతా శిలాప్రతిమల వలే బిగుసుకు పోయారు

హేట్స్ ఆఫ్ టు దిస్ డ్యూటీ మైండెడ్ ఆఫీసర్ ఈలాంటి వారు నూటికి ఒక్కరుంటే చాలు అనుకున్నారంతా వారికి తెలియకుండానే వారు ముకుళిత హస్తాలతో దయానందరావు ముందు మౌనంగా నిలుచుండి పోయారు □